
# కలిసిన ఆశయాలు

**ఆనంద కృష్ణ**



ఇంట్లోనూ బయటా కూడా 'పెళ్ళి' చేసుకోమని వత్తిడి ఎక్కువే అవుతోంది మూర్తి మీద... అడ్వొకేట్‌గా బోర్డు కట్టిన కొద్ది రోజులనుంచి ప్రతివాళ్ళూ పెళ్ళి చేసుకోమని సలహా ఇచ్చేవారే. ముందర రోజుల్లో "ఇంకా కొంచెం ప్రాక్టీస్—వచ్చేలోగా ఎలాగండీ.." అంటూ వాయిదా వేస్తూ వచ్చాడు. కొద్ది సంవత్సరాల్లోనే ఆ ప్రాక్టీసు పెరిగింది, దాంతో అతనిమీద వత్తిడి ఎక్కువయింది.

ఎంతో మంది వచ్చేవారు పిల్లనిస్తామని. కొంత మందిని మూర్తి తండ్రే ఏదో కారణం చెప్పి పంపించేసేవారు. మరికొంత మందిని మూర్తి వద్దనేవాడు.

మూర్తికి ఆ అమ్మాయిలు నచ్చక పోవడంకంటె తన ఆశయాలకు తగ్గ మనుష్యులు రాకపోవడమే అతను వాళ్ళెవరినీ చేసుకోక పోవడానికి కారణం... అతని కోర్కెలు అంత గొంతెమ్మ కోర్కెలేం కావు...

అతనికి కావలసిన పిల్ల....

అమ్మాయి చదువుకున్నదై ఉండాలి... చలాకీగా కన్పించాలి. వచ్చిన అతిథులను సత్కరించి పంపించ గలదై ఉండాలి. అందం విషయంలో అప్సరస ఏం అక్కర్లేదు..... సంస్కారం, సభ్యత.. ఇవన్నీ ఉంటే చాలు.

వీటన్నిటి కంటే ముఖ్యమైనది.. వాళ్ళు బేరం మనుష్యులు కాకూడదు... ఇటువంటి ఆశయాలూ, అభిరుచులూ ఉన్నా వచ్చిన సంబంధాలేం కుదరక పోవడానికి కారణాలు....

ఒకాయన వస్తూనే మరోమాటామంతీ లేకుండా పెళ్ళంటే ఏదో వ్యాపారంలా మాట్లాడటం మొదలు పెట్టాడు. ఆయనకి ఇద్దరు అమ్మాయిలుట... ఒక అమ్మాయికి అ క్రితం సంవత్సరమే ఓ ఆరు వేలు కట్నం ఇచ్చి... ఓ ఇంజనీరు గారికిచ్చి పెళ్ళి చేశాడుట. అమ్మాయి ఎస్.ఎస్.ఎల్.సి. వరకు చదువుకుందిట. ఆయనతో కూడా వచ్చినాయన మొదలు పెట్టాడు... అమ్మాయి చాలా తెలివైనదిట, చాలా బావుంటుందిట, పాడుతుందిట. ఒకటేమిటి నిజమో అబద్ధమో కాని... అన్ని సద్గుణాలు ఏకధాటిగా వర్ణించేశాడు, తక్కిన విషయాలెలా ఉన్నా 'ఆరువేలు కట్నం ఇస్తారుట తనకి'.. ఇదేమైనా మార్కెట్టులో కూరగాయలు కొనడమనుకున్నారేమో!

అక్కడితో ఆగలేదు. తను ఊ! అంటే ఆ అమ్మాయిని తన వూరే తీసుకువచ్చి చూపిస్తాడుట...

మూర్తికి అర్థంకాని విషయం ఎంత ఆడపిల్ల తండ్రి అయితే మాత్రం... అంత చిత్తం చిత్తం అనడమెందుకో!! .. లేకపోతే అమ్మాయిని తీసుకు వచ్చి చూపిస్తాడుట— 'నయం కూడాతీసుకు వచ్చెయ్యలేదు'... అనుకున్నాడు.

మరో పెద్ద మనిషి— అమ్మాయి రూపురేఖా లావణ్యాలు, చదువు వచ్చిన లలిత కళలు, వచ్చిన

ప్రొఫెసర్ తన కూతుళ్ళకి కట్టాడు. గజాల వర్మాంటివి అమ్మాయి చదువుమీద చాలాఖర్చు పెట్టాడుట. అంచేత కట్నం ఓ అయిదువేల కంటే ఇవ్వలేడుట.

ఎవడేడిచాడు కట్నం ఇమ్మని!? తనుకాని తన ఇంట్లో వాళ్ళు కాని కట్నం విషయం ఎత్తనప్పుడు ఆ విషయం అప్పుడు ఎందుకు మాట్లాడవలసి వచ్చిందో!?

ఆ ఒక్క మాటతో ఆ సంబంధం తప్పిపోయింది. ఆ పెద్ద మనిషి ఆ కట్నం విషయం బజార్లో కూర గాయల బేరంలా చెప్పకపోతే— కనీసం ఆ అమ్మాయిని చూడటానికైనా వెళ్ళి వచ్చేవాడు— ఆయన మాట్లాడిన తీరుతో కనీసం ఆ అవకాశం కూడా లేకపోయింది. లేక పోతే ఆ అమ్మాయిని తను చూసి నచ్చితే ఏం జరిగేదో!...

ఎవరినోటంటటో విన్నాడు ఒకసారి— కట్నం 'ఏడువేల ఏనిమిదివందల యాభై' రూపాయలుట— ఆ విషయం మీద ఎన్ని బేరాలు జరిగి ఉంటాయో, మధ్యవర్తులు ఎంతమంది ఉండిఉంటారో, పెళ్ళి ఎలా జరిగి ఉంటుందో ఆ 'అంకె' చెబుతుంది.... రేడియో ధరలు చెప్పినట్టుగా... ఇరవై ఎనిమిది రూపాయల తొంభైమూడు పయాసైసలు అన్నట్టు కట్నం 'ఏడువేల ఎనిమిది వందల యాభై!... ఇవ్వ దలచుకున్నవాళ్ళు పుచ్చుకోదలచుకున్నవాళ్ళకు ఏదో గవ్ చుప్‌గా మాట ఇచ్చేసి ఊరుకోక పదిమందితోటి మాఅమ్మాయికి అయిదువేలో, పది వేలో కట్నం ఇచ్చి పెళ్ళి చేశామని చెప్పుకోవడం ఎందుకో!? మూర్తి దృష్టిలో అమ్మాయికి కట్నం ఇచ్చి చేశామని చెప్పుకోడం సిగ్గుచేటు....

తనకు తెలిసిన పెద్దమనిషి ఒకాయన 'పూర్వ జన్మంలో ఏదో పాపం చేస్తే ఈ జన్మలో ఆడపిల్లల తండ్రి అయి తీరతాడు' అన్నట్టు మాట్లాడతాడు... అటువంటి విషయాలు అమ్మాయిలకు తెలిస్తే ఆడ జన్మ ఎత్తడమే పాపం అనిపిస్తుంది.. తండ్రి బాధలు చూడలేక తనను చేసుకోడానికి (ఏ పదివేలు కట్నం తీసుకుని) ఒప్పుకున్న ఎవరినైనా చేసుకోడాని కొప్పేసుకుంటారు అమ్మాయిలు... వాళ్ళకి ఉన్న ఆశయాలూ అభిరుచులూ అన్నీ చంపుకుని!!?...

తనకూ ఎన్నో ఆశయాలు అభిరుచులూ ఉన్నాయి. అలాగే అమ్మాయిలకూ ఏవో కోరికలు,అభిప్రాయాలూ ఉండొచ్చు. అందుకనే తను ఎవరినైనా అమ్మాయిని చేసుకోడానికి నిశ్చయించుకొంటే ఆ అమ్మాయి అభిప్రాయం కూడాతెలుసుకోవాలి అన్న కోరిక కూడా లేకపోలేదు మూర్తికి... ఇదే విషయం తన మిత్రుడు శాస్త్రితో అంటే "ఎందుకు నవ్వుకోరురా నీకేం లోటు... అనవసరంగా ఆ అమ్మాయి అభిప్రాయం అడిగావంటే ఆ అమ్మాయి దృష్టిలో దిగజారి పోతావ్" అని జవాబు.

దేంట్లో....దిగజారి పోవడమేమిటో!?

అమ్మాయిలు ఇష్టంలేని పెళ్ళికి బలవంతం మీద ఒప్పుకుని తరువాత ఇష్టంలేనిపని చేశామన్న బాధతో తమ జీవితం నరకం చేసుకుని సంసారాన్ని నరకం చేయడం— వాళ్ళు చేసిన, కనీసం చేశామనుకున్న త్యాగానికి పర్యవసానం...

ఆ పెళ్ళి ఇష్టం లేనప్పుడు మొహంమీద చెప్ప చ్చుగా!? అన్న అనుమానం—వెంటనే, "పాపం వాళ్ళు మాత్రం ఏం చేస్తారు... తండ్రుల బాధలు చూడలేక 'ఎవరో ఒకరు' అని ఒప్పుకుంటారు" అని వాళ్ళమీద ఓ విధమైన జాలి... ఇటువంటి ఎంత ఎంత ఆలోచనలు మూర్తికి...

మూర్తి తండ్రి మూర్తికి తగ్గవాడే... మూర్తి ఎంత అంటే అంత. ఆయన ఉద్దేశ్యంతో వివాహం విషయంలో మొహమాటాలు, బలవంతాలు పనికి రావు. అందుకే మూర్తి విషయంలో అతనికి నచ్చితే కాని తనేం చెప్పనన్నారు....

* * *

ఆ రోజు తన ఆఫీసు గదిలో కూర్చుని ఏదో పని చూసుకుంటున్నాడు. అంతలో ఎవరో పెద్ద మను షులు రావడం తిన్నగా నాన్నగారి గదిలోకి వెళ్ళడం చూశాడు. వాళ్ళెవరు అయి ఉంటారా అని ఆలోచించే లోపునే తనకు పిలుపు వచ్చింది నాన్నగారి దగ్గరనుంచి.

పరిచయాల తరువాత అసలు విషయంలోకి దిగింది సంభాషణ— ఆ వచ్చిన వారిద్దరూ అన్న దమ్ములుట— ఆ చిన్నాయన నాన్నగారికి తెలిసిన వాడేనట.

ఆయన చెప్పవలసింది క్లుప్తంగా చెప్పాడు. అమ్మాయి పేరు 'శారద'ట యూనివర్సిటీలో ఎమ్.ఏ. చదువుతోందిట.... శారద పేరు వినగానే మూర్తికి ఓ విధమైన సదభిప్రాయం ఏర్పడింది. కారణం ఆ పేరులో అతనికి వినయం, వినయధేత, రూపం అన్నీ కన్పిస్తాయి... అంతకంటే మరేం విశేషాలు చెప్పలేదు. వీలయినప్పుడు తన ఇంటికి రమ్మని ఆహ్వానించి వెళ్ళి పోయారు.

* * *

శారద తనకువచ్చిన 'టెలిగ్రాం' రూమ్‌మేట్ సరోజకు చూపించింది... "నీవు వెంటనే రావలసింది సిరాక ఎంతైనా అవసరం" ఇది ఆ టెలిగ్రాం తాత్పర్యం.

సరోజ ఆ టెలిగ్రామ్ చూసి ఇంతేనా అన్నట్టు చూసింది. పైగా చిరునవ్వు నవ్వింది కూడా.

"నాకేమో టెలిగ్రామ్‌వస్తే నీకేమో నవ్వులాటగా ఉందే!?" సరోజను అడిగింది శారద.

"లేదోయ్... ఆ టెలిగ్రామ్ చూస్తే నవ్వొచ్చింది. ఆ టెలిగ్రామ్ ఎందుకు ఇచ్చి ఉంటారో తెలుసా?

"ఇంట్లో ఏమైనా నీకు పెళ్ళి చేసేద్దామను కున్నారా!?"

"మా బామ్మ పట్టుదలతోయ్ — నాన్నగారిని తొందర చేస్తోంది."

"అయితే ఇకనేం— తమర్ని ఎవరో చూసుకో డానికి వస్తున్నారన్న మాట... నీకింకా ఇటువంటి అనుభవం లేదు కదూ!? ఆల్ ది బెస్ట్."

"ఒకటి మాటుకు నిజమోయ్.. మా బామ్మ నా పెళ్ళి చేసేద్దామని ఎంత తొందర పడ్డా— నాకు నచ్చే అబ్బాయి దొరికేవరకు పూరుకుంటుందిట... నాకు నచ్చే అబ్బాయి ఎలా ఉండాలో తెలుసా....!?"

"చెప్పందే ఎలా తెలుస్తుందోయ్!?" ఎదురు ప్రశ్న వేసింది సరోజ.

"అయితే విను.. మొదటిది చదువుకున్నవాడై ఉండాలి. రెండు 'కట్నం' అడగకూడదు.. మనిషి "వ్యక్తి"గా చూడాలి..."

"అంటే నువ్వు చదువుతున్నది ఎమ్.ఏ. కాబట్టి ఓ. పి. హెచ్.డి.అబ్బాయి నీ మాటలకు విలువ ఇచ్చి అసలు పెళ్ళికి ముందర నీ అభిప్రాయం కూడా తెలుసుకోవాలి... అవునా!?"

"ఏం! దాంట్లో తప్పేం ఉంది!? జీవితాంతం కలిసివుండవలసిన వాళ్ళు ఆ సంబంధం నిర్ణయించుకునే ముందు ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలుసు కోవడంలో!?"

"తప్పేం లేదు... ఎటొచ్చీ ఆచరణయోగ్యం కాదు. ఏదో విషయం నీ ఆశయాలు ఫలించాలనే 'విష్' చేస్తాను.అయితే అటువంటి ఆలోచనలు వీలయినంత వరకు తగ్గించుకో. లేకపోతే అనవసరంగా బాధపడ వలసి వస్తుంది" బాధగా అంది సరోజ.

"ఏం..."

"నీ ఆశయాల్లో ఒకటి కట్నం అడగకూడదు. అవునా!? నా విషయమే తీసుకో... ఈ నెలవుల్లో నా పెళ్ళని చెప్పాను కదూ? కట్నం ఎంతో తెలుసా? ఆరు నెలు. అంటే జీవితంలో మన విలువ పైన ఆరువేలన్న మాట"

"అయితే ఎందుకు ఒప్పుకున్నావోయ్!? 'నో' అని ఉండవలసింది"

"అనిఉండేదాన్ని... అయితే పరిస్థితులు అనని య్య లేదోయ్"

"అంటే!?"

"చెప్పకానికేముందోయ్... నాకూ ఆశయాలుం డేవి.. 'కట్నం' అడిగిన వాడిని పెళ్ళి చేసుకోకూడదని అనుకున్నాను... అయితే ఆ నా ఆశయంవల్ల నాన్న గారి బాధలు ఎక్కువే చేసింది. ఇప్పుడనుకుంటూ ఉంటాను. 'బియ్యే' అయి పోగానే చదువు మానేసి ఉంటే రెండేళ్ళు ఎమ్.ఏ. ఓ ఏడాది రిసెర్చి డబ్బు మిగిలేవి... పాపం నాన్న గారికి ఇదో అనవసరమైన ఖర్చు. దానికి తోడు అన్నయ్య సద్దతు లేకపోతే ఏమయ్యేదో!? కనీసం అయిదుగురో ఆరుగురో వచ్చారోయ్ నన్ను చూసుకోడానికి— వచ్చిన వాళ్ళతో కొంత మంది మాకు నచ్చక పోవడమో లేకపోతే వాళ్ళే వద్దనడమో జరిగింది... రకరకాల మనుష్యులు— ప్రతి వాళ్ళకీ పరాయి వాళ్ళ డబ్బు కావాలి. అమ్మాయి చదువుకంటే—అమ్మాయి సంస్కారం, రూపం అన్నిటికంటే ముఖ్యమైనది విలువైనది ఆ అమ్మాయి తీసుకువచ్చే నోట్ల కట్టలు."

"అందరూ అలానే ఉంటారంటే పేనొప్పుకో నోయ్"

"శారదా.. నువ్వు ఇంకా అనుభవం లేనిదానివోయ్. నీ దగ్గర దాపరిక మేముంటి... చెబుతా విను.. మొట్టమొదటగా నన్ను చూసుకోడానికి ఓ ఇంజ నీర్ గారు వచ్చారు. నన్ను చూసి వెళ్ళి పోయిన తరు వాత మధ్యవర్తి ద్వారా 'కట్నం' విషయం బేరమాడి నట్లు మాట్లాడించారు... మా నాన్న గారికి మా ఇంట్లోఎవరికీ ఈ విషయం నచ్చలేదు. మేమే ఆ సంబంధం వదిలేస్తే వాళ్ళకేమో నామర్దా అని జాత కాలు కుదరలేదని కబురు పెట్టేశారు.

మరో చిన్న ఆఫీసరుగారు.. బోలెడంత ఆస్తి ఉంది. కట్నాలంటే అసలు వాళ్ళకి ఇష్టం లేదుట—ఎటొచ్చీ అలక పాన్పుమీదనే అంబాసిడర్ కారు కావాలిట— పాపం! చిన్న కోరిక.

మరొక ఆయనకు ఓ చెల్లెలుంది — ఆ అమ్మాయి పెళ్ళి ఆయనే చెయ్యాలిట— ఆమెకోసం పదివేలు కావాలిట.... పాపం అది నిజమే ఆయన్ని మాత్రం ఆయన చెల్లెలి పెళ్ళి ఎలా చేస్తాడు!?...

మా నాన్నగారు ఏదో సంబంధాలు తీసుకురావడం అవి కుదరకపోవడం— నాన్న చిన్నబుచ్చుకోడం .... వేలకువేలు కట్నాలు మా నాన్న మాత్రం ఎక్కడ

కుంది తీసుకువచ్చి ఇస్తారోయ్. అయినా చివరికి ఈ సంబంధం నిశ్చయించారు.....

లేని కట్నం లేకుండా ఎవరైనా పెళ్ళి చేసుకుంటే వెనకాతలే ఏవేవో అంటారు... అంతెందుకు! మా అన్నయ్యకు కట్నం పుచ్చుకోకుండా చేసుకున్నాడని 'ఏదో ఉండి ఉంటుంది—లేకపోతే నిక్షేపంలా ఉద్యోగం చేసుకుంటూ కట్నం పుచ్చుకోక పోవడమేమిటి!?' అన్నారు.

మా సీనియర్ ఒక అమ్మాయి తండ్రి బాధలు చూడలేక ఎవరో ఒక లెక్చరర్ను చేసుకుంటే ఆ అమ్మాయిని, ఆ లెక్చరర్ని నానా మాటలు అన్నారు — వాళ్ళది ఆదర్శం కాదుట— ఆశయం అసలే కాదుట—కేవలం గ్రుడ్డి ప్రేమట... ఇలాగే ఉంటాయ్ ఎదుటి వారి బాధలను సహృదయంతో అర్థం చేసుకునేవాళ్ళ చాలా తక్కువ... మన ఆశయాలను పట్టుకుని వేళ్ళా డితే వచ్చేది మన తండ్రులకే బాధ''

తన కథ క్లుప్తంగా చెప్పుకుని... "శారదా! నా విషయంలో నాకు ఆ అదృష్టం లేదోయ్.. నీకైనా ఆ అదృష్టం కలుగుతుందేమో!? ఆల్ ది బెస్ట్..." నవ్వుతూ అంది సరోజ.

* * *

అవూరు వెళ్ళిన రోజునే తనకు కాలేజీలో క్లాస్మేట్ కమల కనిపించింది. ఏవో మాటలు చెబుతూ అంది "శశికి పెళ్ళయ్యిందోయ్. కట్నం ఏం తీసుకో లేదుట పెళ్ళికొడుకు...డాక్టరుగారు...మేం అందరం నిజమే అనుకున్నాం... అయితే తరువాత తెలిసిన విషయం ఏమిటంటే ఆయన డిస్పెన్సరీ తెరవడానికి ఖర్చు పెట్టిన సుమారు నలభై వేల రూపాయల్లోను సగం శశి నాన్న గారు ఇచ్చారుట. ఎలా ఉంది!"

సరోజ చెప్పిన మాట చాలా వాస్తవికంగా కన్పించాయి శారదకు. రేపు రాబోయే పెళ్ళికొడుకు ఎటువంటి వాడో! ఏ మాత్రం అసభ్యంగా ప్రవర్తించినా మొహంమీద తిట్టెయ్యాలన్నంత కోపం వచ్చింది శారదకు.

* * *

వాళ్ళ కాఫీ ఫలహారాలు పూర్తయిన తరువాత శారద డ్రాయింగ్ రూంలోకి వచ్చింది.

"మా అమ్మాయి శారద— యూనివర్సిటీలో ఎమ్.ఏ. చదువుతోంది" అంటూ శారదను పరిచయం చేసి మూర్తినీ, మూర్తి తండ్రినీ ఏలూరులో ఎడ్వొకేట్స్‌గా పరిచయం చేశారు శారద తండ్రి... ఆయనతో పాటు ఆయన తమ్ముడు— మరో పై మనిషి ఎవరూలేరు. నమస్కార ప్రతినమస్కారాలు జరిగాయి.

మూర్తి ఆమెవైపు చూశాడు. సరిగా అదే సమయానికి తనవైపు చూస్తున్న ఆమె సహజమైన సిగ్గుతో తల వంచేసుకుంది. నిరాడంబరమైన వేషం.. 'శారద' అనే పేరుతో తనువూహించుకునే సౌందర్యం, మొహంలో అమాయకత— వినయం, విధేయత అన్ని ఆమెలో మూర్తీభవించినట్లు అన్పించింది మూర్తికి.

కొద్ది క్షణాలు నిశ్శబ్దం...

"ఎమ్.ఏ. లో మీ గ్రూప్ ఏమిటండీ" అంత వరకూ అలముకున్న నిశ్శబ్దాన్ని చీలుస్తూ మూర్తి ప్రశ్న.

సబ్జక్టులో ప్రశ్న వేస్తాడు కాబోలు... ఒకవేళ ఏమయినా అటువంటి దేది వేస్తే తగ్గట్టు జవాబు చెప్పొచ్చు అనుకుని "ఎకనామిక్స్" అంది.

"రమణారావు —మీ డిపార్ట్‌మెంట్ అనుకుంటాను"

ఎంత పొరపాటు చేద్దాను...!? అనుకుని "అవునండీ మా డిపార్ట్‌మెంటే... అయితే మాకు రారు"

"అతను నాకు బియ్యేలో క్లాస్‌మేట్ లెండి... కాలేజీలో ఉన్నంత కాలం నాటకాల్లో, వేషాల్లో, ఆటల్లో చాలా ఏక్టివ్‌గా ఉండేవాడు."

శారద నవ్వుతూ "ఇప్పుడు అంతే లెండి మాకి యూ. ఎన్. కాశ్మీర్ ఇష్యూ ఇటువంటి వాటిలో ముందర కన్పించేది ఆయనే."

దాంతో తక్కిన పెద్ద మనుష్యులకి అవకాశం చిక్కింది.

కాశ్మీర్ సమస్యపై సంభాషణ ప్రారంభం అయ్యింది...

కాశ్మీర్ సమస్యపై పాశ్చాత్యదేశాల వైఖరి... కాశ్మీర్ హిందూ దేశంలో ఎలా కలసి పోయిందో—పాకిస్తాన్ దురంతరాలు— ఒకటేమిటి ఆదే కాశ్మీర్ సమస్యపై ఇండియాను సమర్థించే దేశాల కాన్ఫరెన్స్ అయి పోయింది. ఎవరికి తోచింది వారు చెబుతున్నారు.

---

ఒకడు: ప్రయాణానికి బయలుదేరే సమయంలో కుక్క ఎడమవైపునుంచి పోతే మంచిదా? కుడివైపునుంచి పోతే మంచిదా ?

మరొకడు : మీాదబడి కరవకుండాపోతే మంచిది.

సుబ్బారెడ్డి (కోవెలకుంట్ల)

---

అంతలో లోపల్నించి 'శారదా' అని పిలవటంతో లోపలికి వెళ్ళిపోయింది శారద. లోపల మూర్తి తల్లి, చెల్లెలు రాధా, శారద తల్లి కూర్చుని ఏవో మాట్లాడు కుంటున్నారు. శారద వాళ్ళ దగ్గర కూర్చుంది.

అందరూ నిశ్శబ్దంగా ఉండటం నచ్చక శారదే మొదలు పెట్టింది. సంభాషణ. "మీరేం చదువుతున్నారండీ?" రాధను అడిగింది.

"బి. ఎస్సి"

"ఏ కాలేజీలో!?"

"ఏలూరు లేడీస్ కాలేజీలో"

"మీాకు బాటనీ లెక్చరర్ గిరిజ తెలుసునా! ?"

"మా లెక్చరర్ మీాకు తెలుసునా!?" రాధ అడిగింది.

"యూనివర్సిటీ హాస్టల్స్‌లో చాలా స్నేహితురాలు.. అక్కడ ఉద్యోగంలో చేరింది మొదలు ఒక్కసారి అవూరు రమ్మని ఒకటే గొడవ"

"తప్పకుండా రండి, మీరు మా కాలేజీ, మా వూరు చూద్దురుగాని యూనివర్సిటీ నేను చూడక పోయినా విన్నదాన్ని బట్టి మా కాలేజీ మీా యూనివర్సిటీలో ఓ బిల్డింగ్ అంత ఉండదు!"

"మీరు యూనివర్సిటీకి ఎప్పుడూ రాలేదా!?"

"లేదండి—డిశంబరునెలలో బాటనీ ఎక్స్‌కర్షన్ కద్దామనుకుంటున్నాం. బహుశా, గిరిజగారే మాతో వస్తారు."

"అహా! అలాగా!! వచ్చే ముందర వ్రాయండి మీాకు హాస్టల్ లోనే రూమ్స్ ఎరేంజ్ చెయ్యొచ్చు. డిశంబరులో అయితే ఓ వారం రోజులు ఉండేటట్లు రండి— యూనివర్సిటీ అంతా కళకళలాడు తూంటుంది— కాన్వొకేషన్—ఆంధ్రా వీక్స్ ఒకటి దాని తరువాత—మరొకటి—గిరిజకు నేను వ్రాస్తాలెండి."

ఏవో యూనివర్సిటీ విశేషాలు చెబుతూనే ఉంది శారద. రాధ వూఁ! కొడుతూనే ఉంది మధ్య మధ్య ప్రశ్నలతోటి. వాళ్ళ గొడవలో పక్కన మరో ఇద్దరున్నారు అన్న విషయమే మర్చి పోయారు.

"ఇంక వెడదామే— నాన్నగారితో చెప్పు" అంది రాధ తల్లి.

"వస్తామండి" అంటూ లేచారు. రాధ, తల్లీనూ, అందరూ డ్రాయింగ్ రూంలోకి వచ్చారు. అంతవరకు ఇంకా 'కాశ్మీర్' సమస్య పై చర్చ సాగిస్తున్న వాళ్ళంద రూ వీళ్ళను చూడగానే వాళ్ళ చర్చ వాయిదా వేశారు సెక్యూరిటీ కౌన్సిల్ మీటింగ్‌లా.

రైలు బండికి సిగ్నల్ ఇచ్చినట్లు "వస్తామండి" అంటూ లేచారు మూర్తి తండ్రి, మూర్తీనూ...

"వెళ్ళగానే వ్రాస్తామండి" అన్నారు మూర్తి తండ్రి.

"మంచిదండి"

గుమ్మందాకా వచ్చి సాగనంపారు వాళ్ళను శారద తండ్రీ, చిన్నాన్నామూ.

రైల్లోనే అన్నారు మూర్తి తండ్రి "నీ ఇష్టమోయ్, ఆ అమ్మాయి చిన్నాన్న నాకు నాకు బాగా తెలుసు.. చాలా మర్యాదస్తులు ఆ విషయం ఆలోచించక్కర్లేదు" అని.

"అమ్మాయి లక్షణంగా ఉందిరా— ఏమయినా నీ ఇష్టం" అంది మూర్తి తల్లి.

"భలేగా చెబుతుందిరా కబుర్లు—యూనివర్సిటీ విశేషాలు ఎన్ని చెప్పిందనుకున్నావ్... మా బాటనీ లెక్చరర్ గిరిజగారు తనకు చాలా స్నేహితురాలట"— కొత్త చుట్టరికం కనిపెట్టినట్టు చెప్పింది రాధ.

* * *

మూర్తి ఆలోచనలో పడ్డాడు. ఆ రోజువరకూ అమ్మాయి అభిప్రాయం కనుక్కుంటే కాని పెళ్ళికి ఒప్పుకోను అనే వాడల్లా ఆ అమ్మాయికి ఉత్తరం వ్రాస్తే... ఏమో!?ఏమనుకుంటుందో!? వ్రాయక పోతే శాస్త్రి నవ్వుతాడేమో!? పెళ్ళయి పోయిన తరువాత "మిమ్మల్ని చేసుకుందామని నేనెప్పుడూ అనుకోలేదు!?" మావాళ్ళు బలవంతంచేసి చేయించారు. అంటుందేమో! అన్నీ అనుమానాలే.

చివరకు ధైర్యం చేసి ఎలాగైతేనేం ఓ ఉత్తరం వ్రాద్దామని నిర్ణయించుకున్నాడు— ఓ రెండు రోజులు ఆలోచించి.

* * *

"టెలిగ్రామ్ ఎందుకు ఇచ్చారోయ్!?" ప్రశ్నించింది సరోజ.

శారద జవాబుగా నవ్వేసివూరుకుంది.

"అయితే నేమాహించింది 'కరెక్టు' అన్నమాట"

"వూఁ"

"ఏమంటాడోయ్ పెళ్ళికొడుకు! ఏం చదువు కున్నాడు!? నిన్ను ఏం ఏం ప్రశ్నలడిగారు? అబ్బాయి నీకు నచ్చాడా!? చెప్పవోయ్ నా దగ్గర దాపరికమెం దుకు... ఇంతకూ ఏమాత్రం ఖరీదులో ఉన్నాడు!?"

ప్రశ్నల వరంపర కురిపించింది సరోజ.

"అబ్బాయి అడ్వొకేట్‌ట... 'కట్నాలూ' బేరాల మనుష్యులు కారుట నాన్నగారు చెప్పారు..." శారద జవాబు ఇచ్చింది.

"చాలా అదృష్టవంతురాలివోయ్... అయితే ముహూర్తం ఎప్పుడు పరీక్షల తోపులో కాదుగా!?"

* * *

తనకు వచ్చిన ఉత్తరాన్ని చదివి నిజమో కాదో అని అనుమానంతో మరోసారి చదివి,,, సరోజకు చూపించింది.

ఆ ఉత్తరంలో ఇలా ఉంది

'డియర్ శారదా,

మీకు నేను ఈ ఉత్తరం వ్రాయడం ఆశ్చర్యంగానే కన్పించవచ్చు. చొరవచేసి ఈ ఉత్తరం వ్రాస్తున్నందుకు అపార్థం చేసుకోరని ఆశిస్తు న్నాను.

వ్రాయ దలచుకొన్నది సూటిగా వ్రాయటం మంచిదనుకుంటాను. నాకున్న చిన్న కోరిక అ న ం డి..... ఆ శ య ం అ న ం డి— వివాహానికి ముందర అమ్మాయి అభిప్రాయం కూడా తెలుసుకోవాలని...—ఎదురుగా ఎలా అడగను ఆ విష యం? పైగా అడగడానికి అస్కారం ఏది..? దీనికి కారణం నేను వేరే వ్రాయక్కర్లేదనుకుంటాను. అనేక మంది విషయంలో చూశాను.... అబ్బాయి అంగీకారం తెలుపగానే అమ్మాయి అంగీకారం వచ్చి నట్టే. ఒక వేళ అమ్మాయి అయిష్టత చూపితే పెద్ద వాళ్ళు నచ్చచెప్పడమో, బలవంతం చేయడమో జరుగుతుంది.

నా అంగీకారం తెలిపినంత మాత్రాన మీ ఇంట్లో మీకు ఇష్టం లేకపోయినా మీమీద వత్తిడి తీసుకు వస్తారన్న అనుమానం నాకు లేక పోయినా—మీ అభిప్రాయం కూడా ముఖ్యమే కదూ!?

ఇంతకంటే ఏం వ్రాయనూ! జవాబు వ్రాస్తారని ఆశించడంలో తప్పు లేదనుకుంటాను.

మూర్తి'.

* * *

"ఇటువంటి రోజు కోసమే ప్రతీవారు కలలు కంటారోయ్. తమ ఆశయాలకు, అభిరుచులకు గౌర వం ఇచ్చేవారు—తమకు వ్యక్తిత్వం ఉందని గుర్తించే వాడు— అంతకంటే ఏ అమ్మాయికి మాత్రం కావల సిందేమిటి...?? అందరూ కాకపోయినా కొందరైనా ఇటువంటి వాళ్ళుంటే ఆడపిల్లల తండ్రుల పరిస్థితి ఇలా ఉండేది కాదేమో!?... నిన్ను మనసారా అభినంది స్తున్నానోయ్— "ఇంతకూ జవాబేం వ్రాస్తావ్!?" ప్రశ్నించింది సరోజ.

"నచ్చాడోయ్" అని చెప్పడానికి సిగ్గుపడి "అదే నోయ్ జవాబేం వ్రాయాలో తెలియడంలేదు" అని "జవాబు వ్రాయాలంటావా!?" ఎదురు ప్రశ్న వేసింది శారద.

"జవాబు వ్రాయక పోవడం తెలివి తక్కువతనం.. నీ మాటకు విలువ ఇచ్చి నీ అభిప్రాయం అడిగినప్పుడు జవాబు వ్రాయక పోతే అది ఆయన్ను అవమానిం చడం!"

"అయితే జవాబేలా వ్రాయాలంటావ్!?"

అక్కడే ఉన్న లెటర్ పాడ్ తీసి చక్కటిదస్తూరితో మూడేమూడు ముక్కలు వ్రాసింది సరోజ.

'మూర్తిగారూ,

మీ ఉత్తరానికి జవాబేలా వ్రాయాలో తెలియదు. ఒకటి మటుకు వ్రాయగలను. నా అ ప్రాయాలకూ, ఆశయాలకూ గౌరవం ఇచ్చే మిమ్మ హృదయపూర్వకంగా గౌరవిస్తున్నాను.

ఆ ఉత్తరాన్ని చదివి—చిన్నగా నవ్వి అదే కాగిత మీద సంతకం చేసి పోస్టు చేసింది శారద. ★


## ఉత్తమ చికిత్స




ఏ కారణముల చేతనైనా ధాతునష్టం చెంది, దాంపత్య సౌఖ్యం అనుభవించ లేనివారు వెంటనే 15 నయాపైసల స్టాంపుతో సంప్రదించండి :

డా. ఎ. పూర్ణచంద్రరావు, N.D.F.N.F-U. (Ceylon)

సెక్సు స్పెషలిస్టు,

నాగేశ్వరరావు పంతులు రోడ్, పూర్ణాసిక్చర్సువద్ద, గాంధినగరం, విజయవాడ-3

# నాణ్యత మరియు పొదుపు కుటుంబం అంతటికి




CAPT 6.2 Tel.

## కాల్గేట్

బహుళ వినియోగ టాల్క్

అపురూపమైన పుష్పాల శాశ్వత సువాసనగలది.